క్లుప్తంగా

వైభవంగా దర్గా ఉరుసు మహోత్సవం



నాదెండ్ల: విశ్వాన్ని సృష్టించిన సృష్టికర్త ఒక్కడేనని, సాటి మానవుల సేవతోనే ఆ భగవంతుని ప్రసన్నత పొందవచ్చనదే హజరత్ మహబూబ్ సుభాని బోధనల సారాంశమని దర్గా కమిటీ సభ్యులు చెప్పారు. అప్పాపురంలోని హజరత్ మహబూబ్ సుభాని బాబా దర్గా 18వ ఉరుసు మహోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి, మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆదివారం గంధ మహోత్సవం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. దర్గా నుంచి ప్రత్యేకంగా అలంకరించిన అశ్వంపై గంధాన్ని ఉంచి ఊరేగించనున్నట్లు చెప్పారు.

పేద విద్యార్థులకు 'బాసట'గా స్కాలర్‌షిప్ టెస్ట్



యడ్లపాడు: గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించేందుకు బాసట సామాజిక, సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో 'ప్రతిభా చాలెంజ్–స్కాలర్‌షిప్ టెస్ట్ 2024–25' పరీక్షను శనివారం నిర్వహించారు. స్థానిక లూథరన్ హైస్కూల్ ఆవరణలో ఎంఈవో ఎంవీ నాగరత్నం, ఎస్ఐ వి బాలకృష్ణ హాజరై ప్రశ్న పత్రాల్ని విడుదల చేశారు. మండలంలోని 10 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 304 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాశారు. త్వరలోనే విజేతల పేర్లను ప్రకటించి, ఉపకారవేతనాల్ని అందిస్తామని కమిటీ తెలిపింది. బాసట అధ్యక్షులు నూతలపాటి కాళిదాసు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణలో అశ్రద్ధ వద్దు

డీపీవో విజయభాస్కర్‌రెడ్డి



పనులు పరిశీలిస్తున్న డీపీవో

నాదెండ్ల: మండలంలోని సాతులూరు గ్రామ పంచాయతీని శనివారం జిల్లా పంచాయతీ అధికారి విజయభాస్కర్‌రెడ్డి సందర్శించారు. పారిశుద్ధ్య కార్మికులు, పంచాయతీ సిబ్బందితో సమావేశమయ్యారు. గ్రామంలో చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణను పక్కాగా చేయాలని చెప్పారు. ఇండ్ల నుంచిచెత్త సేకరణను చిత్తశుద్ధితో చేయాలని తెలిపారు. వాహనాల ద్వారా సేకరించిన చెత్తను గ్రామ శివారుల్లో పడవేయకుండా డంపింగ్ యార్డుకు తరలించాలని ఆదేశించారు. కాలువల్లో మురుగునీరు పారుదల లేక దోమలు పెరిగి, అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. బ్లీచింగ్, సున్నం చల్లాలని సూచించారు. వ్యాధులు ప్రబలకుండా పూర్తి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట డీఎల్‌పీవో లక్ష్మణరావు, పంచాయతీ కార్యదర్శి రాఘవయ్య ఉన్నారు.

శాసన మండలిలో ప్రజల గొంతు వినిపిస్తా!

ఎమ్మెల్సీ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావు



ప్రచారంలో లక్ష్మణరావు, ఉపాధ్యాయ నేతలు

శావల్యాపురం: ఉద్యోగులు, అంగన్‌వాడీలు, నిరుద్యోగులతో పాటు వివిధ వర్గాలకు చెందిన సమస్యలు శాసనమండలిలో ప్రస్తావించాలంటే ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి తనను గెలిపించాలని కృష్ణ–గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ పీడీఎఫ్ అభ్యర్థి కె.ఎస్. లక్ష్మణరావు కోరారు. శావల్యాపురంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో శనివారం జరిగిన ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వాన్ని ప్రశ్నించటానికి తనకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. తనను గెలిపిస్తే ఆరు సంవత్సరాల పాటు అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు డి.రవికుమార్, గుడ్లూరి ప్రసాద్, మాదాల రామకోటేశ్వరరావు, సురేష్, ప్రేమ్‌కుమార్, ఉపాధ్యాయుల నేతలు పాల్గొన్నారు.

వినుకొండలో..

పట్టణంలోని యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కె.ఎస్. లక్ష్మణరావు మాట్లాడారు. తాను ఎన్నికైతే ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, నిరుద్యోగుల సమస్యలను చట్టసభల్లో లేవనెత్తి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలియజేశారు.

నరసరావుపేటలో..

ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం పీడీఎఫ్ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావు పట్టణానికి వచ్చారు. సీపీఎం కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. నూతన ప్రభుత్వం అమల్లోకి వచ్చి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు 12వ వేతనం సంఘం నియమించలేదని విమర్శించారు. వీరికి అందాల్సిన రూ.22వేల కోట్ల బకాయిల విడుదల కోసం ప్రయత్నం చేస్తానని తెలిపారు.

స్థూపాన్ని పడగొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి

వినుకొండ: పట్టణంలోని కారంపూడి రోడ్డులో గల కళ్యాణపురి కాలనీ ఆర్చీ ఎదురుగా ఉన్న కామ్రేడ్ వీరిశెట్టి సీతయ్య స్మారక స్థూపాన్ని పగలగొట్టిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నేతలు కోరారు. ఈ మేరకు శనివారం పట్టణ సీఐ శోభన్‌బాబుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు బూదాల శ్రీనివాసరావు, రాములు మాట్లాడుతూ పేద ప్రజల కోసం పోరాడిన వీరిశెట్టి సీతయ్య స్థూపాన్ని పగలగొట్టడం హేయమైన చర్య అని ఖండించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నేతలు పఠాన్ లాల్‌ఖాన్, కొండ్రముట్ల సుభాని, వెంకటేశ్వర్లు, యూనిస్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



నరసరావుపేట ఈస్ట్: విద్యార్థి దశలో అత్యంత కీలకమైన ఇంటర్మీడియేట్ విద్యను అత్యంత క్రమశిక్షణతో పూర్తి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. వాగ్దేవి జూనియర్ కళాశాల 13వ వార్షికోత్సవాన్ని శనివారం విద్యార్థుల కేరింతల మధ్య సందడిగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ వాగ్దేవి కళాశాల విద్యార్థులు ఏటా టాప్ ఇంజినీరింగ్ కళాశాలల్లో సీట్లు సాధించటం అభినందనీయమని తెలిపారు. కళాశాల పూర్వ విద్యార్థి, ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం అధ్యాపకులు డాక్టర్ రామాంజనేయులు మాట్లాడుతూ ఇదే కళాశాల విద్యార్థిగా రూర్కెలా ఐఐటీలో సీటు సాధించి ఇంజినీరింగ్ విద్య, డాక్టరేట్‌ను పూర్తి చేసుకొని వర్సిటీ అధ్యాపకునిగా స్థిరపడ్డానని తెలిపారు.విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో దర్శి టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, కళాశాల డైరెక్టర్లు రాయల శ్రీనివాసరావు, కాట్ల రామకోటేశ్వరరావు, కపలవాయి రాజేంద్రప్రసాద్, పాశం కృష్ణారావు, పోటు అచ్యుతరావు, ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

కోరం లేక మండల పరిషత్ సమావేశం వాయిదా

నరసరావుపేట రూరల్: కోరం లేక మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మూరబోయిన సుబ్బాయమ్మతో పాటు ఎంపీటీసీ సభ్యులు ఒక్కరు కూడా హాజరు కాలేదు. దీంతో కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో పీవీ కృష్ణకుమారి తెలిపారు. సమావేశానికి నలుగురు సర్పంచులతో పాటు ఈవోపీఆర్డీ నాగానంద్, పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు మాత్రమే హాజరయ్యారు.

ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి



ఏపీయం వాసుబాబు సత్కరిస్తున్న ఎంపీపీ, అధికారులు

శావల్యాపురం: అధికారుల సమన్వయంతో పని చేస్తూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీపీ సుహాసిని మాట్లాడుతూ రానున్న వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా అధికారుల భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకోవాలని తెలిపారు. అన్ని గ్రామాల్లో చేతిపంపులు పని చేసేలా చర్యలు తీసుకోవాలని, మంచి నీటి చెరువులను సాగర్ జలాలతో పూర్తిస్థాయిలో నింపాలని కోరారు. గ్రామాల్లో ప్రజలకు అధికారులు నిరంతరం అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జనవరి 26న జిల్లా కలెక్టరు పి.అరుణ్‌బాబు నుంచి ఉత్తమ ఏపీఎంగా ప్రశంసా పత్రం అందుకున్న గుమ్మడిల్లి వాసుబాబును ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పారా హైమావతి, వైస్ ఎంపీపీలు చెన్నంశెట్టి రంగారావు, నంబూరి ప్రభావతి, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, మండల కోఆప్షన్ సభ్యులు దూదేకుల హుస్సేన్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తిరునాళ్ల ఏర్పాట్లు పరిశీలన



తిరునాళ్ల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈవో తదితరులు

బొల్లాపల్లి : నల్లమల అటవీ ప్రాంతంలోని ప్రకాశం–గుంటూరు జిల్లా సరిహద్దులో గల శ్రీ లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల ఏర్పాట్లను దేవాదాయ శాఖ అధికారులు శనివారం పరిశీలించారు. మహా శివరాత్రిని పురస్కరించుకొని స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించడం ఇక్కడి విశిష్టత. జిల్లా దేవదాయ శాఖ అధికారి ఎ.అచ్యుత వెంకట్ ఆలయాన్ని సందర్శించి తిరునాళ్ల సందర్భంగా జరుగుతున్న పనులను పర్యవేక్షించి పలు సూచనలు చేశారని స్థానిక ఈవో ఎ.శ్రీనివాసరెడ్డి తెలిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

ఎన్‌సీడీ సర్వేలో ప్రజలు భాగస్వామ్యం కావాలి

శావల్యాపురం: ఎన్‌సీడీ (నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్) సర్వేలో ప్రజలు భాగస్వామ్యం కావాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్ కోరారు. ఆయన శనివారం స్థానిక ప్రాథమి ఆరోగ్య కేంద్రంలో మాట్లాడారు. సర్వేలో భాగంగా గ్రామాల్లోని వైద్య, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరి సమగ్ర వివరాలు నమోదు చేయాలని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ,హిమోగ్లోబిన్, షుగర్, థైరాయిడ్ వివరాలతో పాటు ఎత్తు, బరువు, ఆహారపు అలవాట్లు మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. భవిష్యత్‌లో వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు, నివారణ చర్యలకు సర్వే దోహదపడుతుందని తెలిపారు. వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉన్నందున సర్వే పురోగతి తక్కువగా ఉన్నందున రాత్రి సమయాల్లో కూడా చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు 30 శాతం చేసినట్లు తెలిపారు. ఆయనతో పాటు సూపర్‌వైజర్లు అలవలపూడి ఏడుకొండలు, ఉమాదేవి, స్టాఫ్ నర్సు బాలిబోయిన లక్ష్మీప్రసన్న, ధనలక్ష్మి ఉన్నారు.



పల్లెలే ప్రగతికి పట్టుగొమ్మలు

- వైఎస్సార్‌ సీపీ హయాంలో పల్లెల్లో సకల సౌకర్యాలు
- సచివాలయాల ఏర్పాటుతో ప్రజల ముంగిట్లో ప్రభుత్వ సేవలు
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పల్లె ముంగిట్లో వైద్య సేవలు
- ప్రభుత్వ పాఠశాలల బలోపేతంతో పేదల పిల్లలకు సమగ్ర విద్య



కాకానిలో గ్రామ సచివాలయం

నరసరావుపేట రూరల్ : పల్లె ప్రగతే దేశ ప్రగతి. మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం దిశగా అడుగులు వేస్తూ గ్రామాలు అభివృద్ధి బాట పడుతున్నాయి. గ్రామీణ పాలన అంతా ఒకే చోట కేంద్రీకృతమయ్యేలా సచివాలయం, రైతుభరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్ పేరుతో అన్నింటిని ఒకే చోట నిర్మించి ప్రజలకు సేవలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మరింత చేరువ చేసింది. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పథకాలు, సేవలు నేరుగా గ్రామాల్లోని ప్రజల ముగింటకు వచ్చినట్టయింది. దీంతో పాటు వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి వద్దకే పాలన తీసుకువెళ్లారు. గ్రామ సచివాలయం, ఆరోగ్య కేంద్రాలు, రైతు సేవా కేంద్రాలు, పాల కేంద్రాలను శాశ్వత భవనాల్లో నిర్మించడం వల్ల గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయి.

అభివృద్ధి పథంలో పంచాయతీలు

దేశ సౌభాగ్యం గ్రామాభివృద్ధితోనే సాధ్యమన్న విషయాన్ని గుర్తించిన ప్రభుత్వాలు వైఎస్సార్ సీపీ బాటలో పంచాయతీల బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నాయి. పేదవర్గాల పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడంతో గ్రామాలకు మరింత శోభ చేకూరింది. ఇదే తరహాలో మారుమూల పల్లెల్లో పటిష్టమైన రోడ్ల నిర్మాణం, శాశ్వత అంతర్గత డ్రైనేజీలతో అభివృద్ధి దిశగా పల్లెలు కదిలాయి.

ఇంటి వద్దకే వైద్యసేవలు

ఆస్తుల కంటే ఆరోగ్యం ముఖ్యమైనదని నమ్ముతూ ప్రతి గ్రామంలో ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు ఇంటింటికీ వైద్యుల్ని పంపి ప్రజారోగ్యంపై వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రక్త నమూనాల సేకరణ, బీపీ, షుగర్ లాంటి వైద్య పరీక్షలు మొదలైనవి ఇంటి వద్దే నిర్వహించి ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించారు. గ్రామంలోని ఆరోగ్య కేంద్రంలో వైద్యసిబ్బంది అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

స్వచ్ఛ గ్రామాలు



లింగంగుంట్లలో ఆరోగ్య కేంద్రం

గ్రామాలలో అపరిశుభ్ర వాతావరణం లేకుండా ప్రత్యేక పారిశుద్ధ్యం పేరుతో అధికారుల పర్యవేక్షణలో డ్రైవ్‌లు నిర్వహించి చర్యలు చేపట్టారు. సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ పేరుతో చెత్త నుంచి సంపద కేంద్రాలు నెలకొల్పి ప్రతి ఇంటి నుంచి తడిచెత్త, పొడిచెత్తను వేరువేరుగా సేకరించి, గ్రామాలలో పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపరుస్తున్నారు. మారుమూల పల్లెల్లో చక్కని విద్యుత్ దీపాల వెలుగులు, అవసరమైన చోట నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. నాడు పాలకులు ముందు చూపుతో గ్రామీణ వ్యవస్థ బలోపేతం కోసం చేసిన సేవలను కొనసాగించి గ్రామీణ వ్యవస్థ మరింత ముందుకు సాగేలా చూడాలన్నదే ప్రజల ఆకాంక్ష.

































